శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



రికార్డులను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయాన్ని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను ఆయన పరిశీలించారు. రికార్డులు, రికార్డ్ రూమ్, రిజిస్ట్రేషన్లు, ఆన్‌లైన్‌లోని దరఖాస్తులు తదితర వివరాలను తహసీల్దార్ యాదిరెడ్డి అదనపు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఈడీఎం శ్రవణ్, డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా మరిలు



హరివర్ధన్‌రెడ్డి చేతులమీదుగా నియమాక పత్రం అందుకుంటున్న మరిలు

మేడ్చల్: మహిళా కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ జ్ఞానాపూర్‌కు చెందిన మరిలు నియమితులయ్యారు. ఈమేరకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి ఆమెకు నియామక పత్రం అందజేశారు. కాంగ్రెస్ పటిష్టతకు, ప్రభుత్వ పథకాలు మహిళలకు చేరేవిధంగా పనిచేస్తానని ఆమె అన్నారు.

మురుగు కాలువను శుభ్రం చేయరా?



కీసర ప్రధాన రహదారిలో కాలువ దుస్థితి

కీసర: కీసర ప్రధాన రహదారిలో ఉన్న మురుగు నీటి కాలువను కొన్ని రోజులుగా శుభ్రం చేయకపోవడంతో మురుగు నీటి కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో దోమల స్వైర విహారం పెరిగిపోయింది. ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులతో పాటు మురుగు కాలువ పక్కనే నివాసం ఉంటున్న కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏడు నుంచి 10 రోజుల ఒకసారి కాలువ పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేసేవారని, ప్రస్తుతం నెల రోజులైనా శుభ్రం చేయడం లేదని, ఈ విషయంలో దమ్మాయిగూడ మున్సిపల్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

రూ.3.50 కోట్లతో అభివృద్ధి పనులు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలోని శేషసాయి నగర్, మల్లికార్జుననగర్ కాలనీ మీదుగా ఉప్పల్ నల్ల చెరువుకు వెళ్తున్న నాలాతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, స్థానికుల అభ్యర్థన మేరకు నాలాకు రిటర్నింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. అందుకు రూ.1.95 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంజూరు పత్రాన్ని శుక్రవారం కాలనీవాసులకు అందజేశారు. భారీ వర్షాలు కురిసినప్పుడు కాలనీలను వరద ముంచెత్తుతోందని, సమస్య పరిష్కారం కోసం ప్రణాళికలు పంపినట్లు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. దీంతో పాటు రూ.1.55 కోట్లతో శేషసాయినగర్, మల్లికార్జుననగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, స్థానికులు సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భీమా నాయక్, అంబటి ప్రభాకర్, సురేష్, ఆనంద్, సల్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్ అభివృద్ధికి రూ.6 కోట్లు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి స్టాండింగ్ కమిటీలో రూ.6 కోట్ల నిధులను మంజూరు చేసినందుకు శుక్రవారం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని చాంబర్‌లో చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ శాలువాతో సత్కరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ చిలుకానగర్ చౌరస్తా నుంచి కావేరినగర్ కల్వర్టు వరకు, వరద నీటి పైప్‌లైన్‌ను వేయనున్నట్లు తెలిపారు. ఈ దారి గుంతలమయం కావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రజాఅవసరాలు దృష్టిలో ఉంచుకుని రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు.

నర్సరీ కనుమరుగేనా..?



రోడ్డు వెడల్పుతో కుంచించుకుపోయిన నర్సరీ స్థలం

దంపింగ్ యార్డ్‌తో నిత్యం సతమతం అవుతున్న జవహర్‌నగర్ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి దూరం కానుందా..? నిత్యం పచ్చదనంతో స్వచ్ఛమైన గాలి అందిస్తున్న నర్సరీ మాయం కానుందా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి పనుల పేరిట నర్సరీని కుదించే క్రమంలో ఆక్సిజన్, ఆహ్లాదం కరువవుతుందా..? అనే ఆందోళన జవహర్‌నగర్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. – జవహర్‌నగర్

జవహర్‌నగర్ చెన్నాపురంలో 4 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నర్సరీలో ప్రభుత్వం ప్రతి సంవత్సరం లక్షల మొక్కలను పెంచి హరితహారం కోసం వివిధ ప్రాంతాలకు తరలించే వారు. మూడు లక్షల జనాభా ఉన్న పట్టణంలో అధిక సంఖ్యలో చెట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొక్కల పెంపకం కోసం స్థలం కేటాయించి రూ.లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మాణాలు చేపడితే రోడ్డు వెడల్పుతో ఆ ప్రహరీ నిర్మాణాలు ప్రస్తుతం నేలమట్టం అయ్యాయి. దీంతో మొక్కల సంరక్షణ కరువైంది. ఇదే అదనుగా భావించిన కొందరు కబ్జాదారులు ఆ స్థలాలపై కన్నేశారు. ఈ విషయంపై కలెక్టర్ కార్యాలయంలో స్థానికులు 5 రోజుల క్రితం ఫిర్యాదు సైతం చేశారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో కనీసం నీరు కూడా పోయకపోవడంతో ప్రస్తుతం మొక్కలు ఎండిపోతున్నాయి. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని స్థలాలను కాపాడాల్సిన అవసరం ఉంది.

స్థలాలను కాపాడి పరిరక్షించాలి

వార్డు నుంచి మున్సిపల్ కార్పొరేషన్ స్థాయికి ఎదిగిన జవహర్‌నగర్‌లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడి వాటిని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. జవహర్‌నగర్‌లో పేరుకే ప్రభుత్వ స్థలాలు ఉన్నా ఇంకా అంగన్‌వాడీ సెంటర్లు కిరాయి భవనాల్లోనే నడుస్తున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం విలువైన స్థలాలను కేటాయించింది. ఆ స్థలాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉంది.

నర్సరీపై నీలి నీడలు..

జవహర్‌నగర్‌లోని సర్వే నంబర్–648లో 4 ఎకరాలు నర్సరీకి కేటాయించగా రాజీవ్‌స్వగృహ, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ప్రధాన రహదారి కోసం అర ఎకరం వరకు తీసుకున్నారు. మరోవైపు 100 ఫీట్ల రోడ్డుకు కొంత పోయింది. గతంలో ఇదే నర్సరీకి రూ.లక్షలు వెచ్చించి ప్రహరీ, గేటు నిర్మాణం చేపట్టి మొక్కలను పరిరక్షిస్తున్న క్రమంలో రోడ్డు వెడల్పుతో నర్సరీ ప్రహరీ నిర్మాణం తొలగించడంతో రక్షణ కరువైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని నర్సరీ స్థలాన్ని కాపాడి ప్రహరీ నిర్మించాల్సిన అవసరం ఉంది.



“ప్రహరీ నిర్మించి నర్సరీని కాపాడండి



నర్సరీకి కేటాయించిన స్థలంలో రోడ్డు వెడల్పులో భాగంగా ప్రహరీని తొలగించడంతో నర్సరీకి రక్షణ లేకుండా పోయింది. దీంతో కబ్జాదారులు నర్సరీ స్థలంపై కన్నేసి కాజేయాలని ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టి నర్సరీలోని మొక్కలను కాపాడాల్సిన అవసరం ఉంది.
–రేవస్ లక్ష్మణ్, యువజన నాయకుడు, జవహర్‌నగర్

ప్రహరీ నిర్మించి కాపాడుతాం



ప్రభుత్వం మున్సిపల్‌కు అప్పగించిన అన్ని స్థలాలను కాపాడుకుంటాం. రోడ్డు వెడల్పులో భాగంగా నర్సరీకి చెందిన ప్రహరీని తొలగించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి ప్రహరీ నిర్మిస్తాం. ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావొద్దు. గతంలో ఉన్న మాదిరిగానే మొక్కలు నాటి నర్సరీని రక్షిస్తాం.
– వసంత, జవహర్‌నగర్ కమిషనర్

స్థలాలను రక్షిస్తాం



ప్రభుత్వ భూములను రక్షించడం మన బాధ్యత. కాప్రా మండలంలో ఇప్పటికే వందల ఎకరాలను స్వాధీనం చేసుకున్నాం. రాజీవ్ స్వగృహ, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ రహదారి కోసం నర్సరీ నుంచి రోడ్డు తీయడంతో ఎకరా స్థలాన్ని అదనంగా సర్వే నెం.184లో కేటాయించాం. కేటాయించిన స్థలాలను మున్సిపల్‌కు అప్పగించాం.
– సుచరిత, కాప్రా తహసీల్దార్ ”

తాగునీటి సరఫరాలో జాప్యం వద్దు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: రానున్న వేసవి కాలం దృష్ట్యా మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలకు తాగునీటి సరఫరాలో జాప్యం లేకుండా, తగిన సమయంలో నీటిని విడుదల చేసేందుకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరేడ్‌మెట్ సీబీఎస్ కాలనీలో ఏడేళ్ల నుంచి పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా అవుతోందని, వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. కాకూర్ జనప్రియ ఆర్కేడ్ అపార్టుమెంట్‌లో నామ మాత్రంగా 4 నెలలు నీటి సరఫరా చేసి సాంకేతిక కారణాలు చెబుతూ నీటి సరఫరా నిలిపివేశారని, వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. మచ్చబొల్లారం డివిజన్ ఏడు జేపీసీ కాలనీల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం కాకూర్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో నీటి అక్రమ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న జలమండలి అధికారిని మందలించారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జలమండలి జీఎం సునీల్, డీజీఎంలు సాంబయ్య, ఆశ్రిత రాజు, మేనేజర్లు నవీన్, మల్లిఖార్జున్, తేజస్విని, కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సునీతయాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, నర్సింగ్‌రావు, నాయకులు పరమేష్, రాముయాదవ్, లక్ష్మణ్‌యాదవ్, యాదగిరిగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



గౌతంనగర్ డివిజన్ సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ అన్నారు. జలమండలి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్పొరేటర్ సునీత ఆధ్వర్యంలో గౌతంనగర్ డివిజన్ పరిధిలోని నీటి సరఫరా, నీటి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సునీల్, డీజీఎం ఆశ్రిత, మేనేజర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

బోడుప్పల్: చిన్నతనం నుంచి విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు ఆగిన తర్వాతే ఎక్కడం, దిగడం చేయాలన్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్ పోలీసులను గౌరవించాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు ఫోన్ మాట్లాడొద్దని ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలంటూ విద్యార్థులచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న విద్యార్థులు

మహంకాళి ఆలయ హుండీ లెక్కింపు

ఉప్పల్: ఉప్పల్ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకున్న తర్వాతే మొదటిసారి అమ్మవారి హుండీ లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. ఈవో వీరేశం, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.లక్షా ఐదువేల వరకు వచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా చైర్మన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర గుప్తా, అనిల్‌కుమార్ గుప్తా, మీనంపల్లి అండాలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్నెల్లుగా జీతాల్లేవు

ప్రజలంతా నిద్రలో ఉంటే.. వారు మాత్రం వీధుల్లో విధుల్లో ఉంటారు.. ఊరు తెల్లారేసరికి రోడ్లను అందంగా ముస్తాబు చేస్తారు.. ఇళ్లల్లో వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జనావాసాలకు దూరంగా తరలించి రోగాల నుంచి విముక్తి చేస్తారు.. అందరి సంక్షేమం కాంక్షించే వారు మాత్రం సమయానికి జీతాలు చేతికి రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దొరికిన చోట్ల అప్పులు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నెలల తరబడి జీతాలు రాకపోవడంతో సారూ.. జీతాలు లేకుంటే ఎట్లా బతికేదీ.. అంటూ వేడుకుంటున్నారు.
– సాక్షి, సిటీబ్యూరో



అర్థాకలితో కొనాయిపల్లి పంచాయతీ కార్మికులు

మిగతా 33 జీపీల్లో 3 నెలలుగా అందని వేతనాలు

పూట గడవడం కష్టమవుతోందని కార్మికుల ఆవేదన

నగర శివారుల్లో 600 మందికి వేతనాలు లేవు

కొనాయిపల్లి పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు రాకపోగా, ఉద్దమర్రి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 4 నెలల నుంచి, మిగతా 32 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు 3 నెలల నుంచి జీతాలు అందడం లేదు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 34 గ్రామ పంచాయతీలు ఉండగా, వీరికి గరిష్ఠంగా ఆరు నెలల నుంచి మూడు నెలలుగా వేతనాలు అందక వారి కుటుంబాలు అర్థాకలితో జీవితాన్ని నెట్టుకొస్తున్నాయి. దీంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వీధులను శుభ్రపరిచే కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం శోచనీయం. వేతనాలు ఇవ్వాలని వేడుకుంటున్న వారికి.. మన ప్రజాప్రతినిధుల స్పందన ఏవిధంగా ఉంటుందోననే చర్చ సాగుతోంది.

- నూతన పంచాయతీ చట్టం ప్రకారం వీరిని మల్టీ పర్పస్ వర్కర్స్‌గా పిలుస్తున్నారు. ఈ కార్మికులకు సంబంధించిన వేతనాలు ప్రతినెలా వారి ఖాతాల్లో జమ అవుతుంటాయి. గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులను బట్టి 8 నెలల నుంచి 3 నెలలుగా వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమకాకపోవడం గమనార్హం. జీతాలు అందక వారు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు.
- నగర శివారు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో గ్రామ పంచాయతీల్లో 600 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి నెలకు రూ.9.500 చొప్పున రూ.57 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. వీరంతా పారిశుద్ధ్యం, ట్రాక్టర్ డ్రైవర్లు, పన్నుల వసూల్లు, నీటి సరఫరా తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు.

త్వరలో వేతనాలు..

పంచాయతీ కార్మికుల వేతనాల అందకపోవడంతో ఇబ్బందిగా ఉందని సంబంధిత శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పాటు ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. త్వరలో వేతనాలు అందుతాయని పంచాయతీ శాఖ అధికారులు భావిస్తున్నారు.

అప్పు చేస్తేనే.. కడుపు నిండేది..

గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతినెలా అందించే రూ.9,500 జీతం ఇవ్వకపోవడంతో అప్పులతో కాలం గడుపుతున్నాం. స్కూల్ ఫీజు మొదలుకొని నిత్యావసరాలు, కరెంటు బిల్లులు తదితర వాటికి ప్రైవేట్ ఫైనాన్స్‌లో మిత్తికి డబ్బులు తీసుకుని చెల్లించాల్సి వస్తోంది. కార్మిక కుటుంబాల్లో కొందరు పస్తులు ఉండాల్సి వస్తోంది. వేతనాలు సకాలంలో అందించకపోతే పంచాయతీల్లో పనులు నిలిపివేసి ఆందోళనకు దిగుతాం.
– శ్రీనివాస్, జిల్లా గ్రామ పంచాయతీ కార్మిక సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

నమ్మించి మోసం చేస్తారు జాగ్రత్త



తిమ్మాయిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు

కీసర: బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా లేని గ్రామాలే సురక్షిత గ్రామాలని గో ఇండియా ట్రస్ట్ ప్రతినిధి ఎ.వెంకటేష్ అన్నారు. తిమ్మాయిపల్లిలోని ప్రభుత్వ పాఠశాల, వార్డు కార్యాలయ ఆవరణలో సురక్షిత గ్రామంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కొన్ని చోట్ల తెలిసిన వాళ్లే నమ్మించి మోసం చేసి యువతులు, మహిళలను అక్రమ రవాణా చేసి వ్యభిచార గృహాలకు అమ్మేస్తున్నారని, అబ్బాయిలను బాల కార్మికులుగా మారుస్తున్నారని అన్నారు. వీటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాంటి ఘటనలు మీ దృష్టికి వస్తే 100, 1098, 181, 18004198588లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మాజీ సర్పంచ్ పెంటయ్య, ఇన్‌చార్జి కార్యదర్శి సురేష్‌రెడ్డి, సంస్థ సభ్యులు నవీన్, పూర్ణ, రాణి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకుంటే కరెంట్ కట్



మేడ్చల్‌లో ఎస్ఎంఎస్ యాప్ ద్వారా కరెంట్ కట్ చేస్తున్న విద్యుత్ అధికారులు

మేడ్చల్: కరెంట్ బిల్లులు చెల్లించని మొండి బకాయిదారుల నుంచి బిల్లులు వసూలు చేసేందుకు మండలంలో విద్యుత్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ మొదలు పెట్టారు. ఏడీఈ రాజమల్లేషం, ఎఈలు రాంబాబు, మౌలాలి, విజయ్‌కుమార్, ఏఏఓ నాగేశ్వర్‌రెడ్డి సిబ్బందితో కలిసి అన్ని గ్రామాల్లో పర్యటించి మొండి బకాయిలు చెల్లించని వారికి విద్యుత్ సరఫరా నిలిపివేసి పవర్ కట్ చేశారు. వెంటనే బిల్లులు చెల్లించాలని లేదంటే సరఫరా పూర్తిగా నిలిపివేస్తామని, అక్రమంగా విద్యుత్ వాడితే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. సకాలంలో బిల్లులు చెల్లించి సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎస్ఏఎస్ యాప్ ద్వారా కరెంట్ సరఫరా నిలిపివేసే అవకాశం ఉందని తెలిపారు.

సెయింట్ పీటర్స్ విద్యార్థులకు పతకాలు



విద్యార్థినులను అభినందిస్తున్న డైరెక్టర్, పిన్సిపాల్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ డబ్ల్యూయూఎస్‌హెచ్‌యూ పోటీల్లో విద్యార్థిని హరిణి 65 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించగా 60 కేజీల విభాగంలో నేహాస్విక సిల్వర్ మెడల్, 50కిలోల విభాగంలో మహేశ్వరి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, పీఆర్వో రవి సుధాకర్, పీడీ వెంకట నారాయణ విద్యార్థినులను అభినందించారు.

నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి



సదస్సులో పరిశోధన పత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: అధ్యాపకులు, విద్యార్థులు సంపాదనే లక్ష్యంగా ఉండకుండా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంపై దృష్టి సారించాలని స్ప్రింగర్ నేచర్ అసిస్టెంట్ ఎడిటర్ ప్రియావ్యాస్, మల్లారెడ్డి విద్యాసంస్థల డైరెక్టర్ శాలినిరెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల – మెయిన్ క్యాంపస్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ పరిశోధన సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ప్రతి దశలో అధ్యయనాన్ని వీడరాదని హితవు పలికారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ అనేవి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలకు కేంద్ర బిందువులుగా ఉన్నాయని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పర్చుకోవడం ద్వారా వారి రంగాలలో విజయం సాధిస్తారని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, అమెజాన్ ప్రతినిధి అనిల్, బ్రాడ్రిడ్జ్ సంస్థ అధికారి శ్రీవాణి, ప్రొఫెసర్లు నాగేంద్రకుమార్, నారాయణ, కో ఆర్డినేటర్ శ్రీధర్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాష మూలాలు మర్చిపోవద్దు



మాతృభాష దినోత్సవంలో ప్రిన్సిపాల్

మేడ్చల్‌రూరల్: పరభాష జ్ఞానాన్ని ఆర్జించినప్పటికీ మాతృభాష మూలాలు మర్చిపోవద్దని ఎమ్మార్సీఈ ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్సీఈ కళాశాలలో శుక్రవారం ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. అతిథులు ఉమేశ్‌వర్మ, సామల మోహన్ మాతృభాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.